# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**2. విజయవాడలో రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.**

**3. గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలకు కేంద్ర ప్రభుత్వం డిజిటల్ రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.**

**4. రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలు ఎంతో పారదర్శకంగా జరిగాయని పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు.**

**4. ఇండియన్ ప్రీమియర్ లీగ్ - ఐపీఎల్ 2026లో భాగంగా రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది.**

==========================

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 106 మంది లబ్ధి దారులకు 44 లక్షల 50 వేల రూపాయల విలువైన చెక్కులను అందించినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన 21 నెలల్లోనే ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 13 కోట్ల 60 లక్షల రూపాయల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలియజేస్తూ..

వాయిస్…27 సెకన్లు

--------------------------

రెవెన్యూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో 63 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక శాసన సభ్యులు గద్దె రామ్మోహన్ తో కలిసి ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ… పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో 8 కోట్ల రూపాయల

విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం అభినందనీయని తెలిపారు.

---------------------------

గ్రామీణ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం దీనదయాళ్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి పరిధిలో వ్యక్తిగత సంస్థ రుణ దరఖాస్తు డిజిటల్ రుణ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు ఎంఎస్ఎమ్ఈ యూనిట్లు స్థాపించేందుకు 10 లక్షల రూపాయల వరకు వ్యక్తిగత రుణాలు పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, ఫుడ్ ప్రాసెసింగ్, మిల్లెట్లు, మష్రూమ్, తేనె ఉత్పత్తి, చేపల ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తారని వెల్లడించారు. గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకులు, స్త్రీనిధిని సంప్రదించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర- 2026 పేరుతో నిర్వహించనుంది. జూన్ 7వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, జూన్ 21వ తేదీన అమరావతిలో 25 వేల మందితో రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో వర్గంతో వినూత్నంగా యోగాంధ్ర నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులతో, తూర్పుగోదావరి జిల్లాలో ఖైదీలతో.. ఇలా 28 జిల్లాలకు 28 ప్రత్యేక థీమ్‌లను ఖరారు చేసింది. ప్రతి జిల్లా కేంద్రంలో వెయ్యి మంది చొప్పున పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తోంది.

---------------------------

రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలు ఎంతో పారదర్శకంగా జరిగాయని పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు పట్టణ నగర నియోజకవర్గ పరిధిలోని పరమేశ్వరి నగర్, ట్రంకు రోడ్డు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన అధికారులతో కలిసి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకం కింద నెల్లూరు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 14 ఉన్నత పాఠశాలలను విద్యా సంవత్సరం ప్రారంభంలోగా ఆధునికీకరిస్తామని చెప్పారు. పరమేశ్వరి నగర్ లో మైనార్టీ విద్యార్థుల కోసం అన్ని వసతులతో ఉన్నత పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం 39 వార్డులో ఈరోజు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కార్పొరేషన్ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ ను నిల్వ చేసే గోడౌన్ లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లు సాయంతో మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

---------------------------

తిరుపతిలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ -యుపిఎస్సి సివిల్ సర్వీస్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతిలో జరుగుతున్న యుపిఎస్సి పరీక్షా కేంద్రాలను

కలెక్టర్ ఈరోజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తిరుపతిలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో 5 వేల 96 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వివరించారు.

---------------------------

గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్, అనుబంధ పాలిటెక్నిక్ కాలేజీలలో వివిధ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించింది. పదో తరగతిలో ఉత్తీర్ణత పొందిన వారు ఎవరైనా ఆన్‌లైన్‌లో అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. ఎలాంటి ప్రవేశ పరీక్ష లేకుండానే పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని విశ్వవిద్యాలయం తెలిపింది.

---------------------------

విశాఖపట్నం జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల విభాగం అధికారులు, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలతో ఆయన నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ 15వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించాలని సూచించారు. ప్రతి బీఎల్వో విధిగా క్షేత్రస్థాయిలో సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేసి.. తదుపరి ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతుండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. ఈరోజు 21 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 214 మండలాల్లో వడగాల్పులు ప్రభావం ఉండే అవకాశం ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్న సమయంలో ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 134 వ సంచిక ఈనెల 31వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు లేదా నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 29వ తేదీ వరకు పంపవచ్చు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో భాగంగా రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది. ముంబైలోని వాంఖెడే స్టేడియంలో ఈ మధ్యాహ్నం మూడున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మరో మ్యాచ్‌లో కోలకత్తా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడనున్నాయి. కోలకత్తాలోని ఈడెన్ గార్డెన్స్ క్రికెట్ స్టేడియంలో ఈ రాత్రి ఏడున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. కాగా.. నిన్న జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టుపై పంజాబ్ కింగ్స్ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

=====================